నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, గురువారం 1 ఫిబ్రవరి 2024 | SIDDIPET

## చాముండేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు



మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చాముండేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చిలిపిచెడ్, జనవరి 31: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీరానది తీరాన వెలిసిన చాముండేశ్వరి ఆలయంలో 41వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో 50 మంది వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మెదక్ జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



హుస్నాబాద్‌లో ఎత్తుబంగారం ఇస్తున్న భక్తులు

# ఉత్తమ మార్కుల కోసం ఉత్తరం


### తల్లిదండ్రుల్లో స్ఫూర్తి నింపుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- సిద్దిపేట నియోజకవర్గంలో 2,516 మందికి చేరిన లేఖలు
- విఠలాపూర్‌లో ఉత్తరం చదివి ఆనందం పంచుకున్న తల్లిదండ్రులు

సిద్దిపేట అర్బన్, జనవరి 31: "మీ పిల్లలకు మంచి భవిష్యత్ అందించేందుకు మీ శ్రమ వెల కట్టలేనిది.. పిల్లలకు నాణ్యమైన విద్య అందితేనే వారి భవిష్యత్ బాగుంటుంది.. విద్యార్థులకు పదోతరగతి కీలకమైనది, వారి భవిష్యత్‌కు పునాదులు వేసే వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి.." అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాసిన మాటలు తమలో స్ఫూర్తిని నింపడంతో పాటు తమ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే హరీశ్‌రావు పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రతి పాఠశాలపై నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఎంత బాధ్యత ఉందో.. తల్లిదండ్రులకు కూడా అంతే బాధ్యత పెంచాలని.. వారి పిల్లలు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేయాలని.. గత నాలుగేండ్లుగా టెన్త్ విద్యార్థుల ఇంటికి ఆయన ఉత్తరాలు పంపిస్తున్నారు.

#### ఉత్సాహాన్ని నింపుతున్న ఉత్తరం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాసిన ఉత్తరం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపుతుంది. తమ పిల్లలపై హరీశ్‌రావు చూపిస్తున్న శ్రద్ధకు వారు ముగ్ధులవుతున్నారు. ఒక గురువులా, ఒక తండ్రిలా, ఒక అన్నలా, ఒక కొడుకులా తమకు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మా పిల్లలకు మంచి భవిష్యత్‌కు పునాది వేస్తూ.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆత్మవిశ్వాసాన్ని నింపారని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రాసిన ఉత్తరంతో తమ బిడ్డబాగా చదివి ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఆయన్ను కలుస్తామని తెలిపారు.




ఒక కుటుంబ సభ్యుడిలా బాధ్యతతో ఇంత బాగా తమ గురించి కేర్ తీసుకుంటున్న హరీశన్నకు ధన్యవాదాలు అంటూ చిన్నకోడూర్ మండలం విఠలాపూర్‌లోని ఓ కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది. విఠలాపూర్ గ్రామానికి చెందిన టెన్త్ విద్యార్థి అజయ్ తల్లిదండ్రులు ఐల్లయ్య, స్వప్నలు ఉత్తరం చదివి ఈ విధంగా స్పందించారు. ఆయన ఆశయం నెరవేరే విధంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా తమలో నూతనోత్సాహం కలిగించిందని విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


T.HARISH RAO
M.L.A.
33 - Siddipet Assembly Constituency.

సదా మీ సేవలో...

"ALL THE BEST"

విద్యార్థుల తల్లిదండ్రులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పంపిన లేఖ

# మేడారం జాతర షురూ

### హుస్నాబాద్‌లో ఎత్తు బంగారం ఇస్తూ మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

- నెల రోజుల ముందే అమ్మవార్ల దర్శనానికి పయనం

హుస్నాబాద్, జనవరి 31: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మేడారం జాతర షురువైంది. వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ జాతరకు నెల రోజుల ముందు నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారికి ఇష్టమైన ప్రతి బుధ, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి హుస్నాబాద్ పట్టణంలోని పలు దుకాణాల వద్ద ఎత్తు బంగారం (అమ్మవార్లకు బెల్లం నైవేద్యం) ఇస్తున్నారు. దీంతో ఆయా దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంటున్నది. అమ్మవారికి మొక్కిన విధంగా భార్యాభర్తలు కలిసి ఎత్తు బంగారం ఇవ్వడం, పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా ఎత్తుబంగారం ఇస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు ఎత్తు బంగారం ఇచ్చి నేరుగా మేడారం జాతరకు వెళ్లి అమ్మవార్ల గద్దెల వద్ద బెల్లం నైవేద్యం సమర్పించి మొక్కులు అప్పజెప్పుతారు. ప్రతి ఫిబ్రవరిలో రెండేండ్లకోసారి వచ్చేజాతర ఈసారి నెల రోజుల ముందు నుంచే భక్తులు మేడారానికి వెళ్తున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు మేడారంలో జాతర జరుగుతుంది. అప్పుడు భక్తుల రద్దీ అధికంగా ఉంటున్నందున ముందుగానే మేడారానికి వెళ్లి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సందడి నెలకొనడంతో హుస్నాబాద్‌లోని ఆయా దుకాణాల్లో బెల్లం కొనుగోళ్లు పెరిగాయి. జాతర సమయం వరకు ఎత్తు బంగారం ఇచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగానే తాము బెల్లం స్టాకు తెప్పిస్తున్నామని దుకాణాదారులు చెబుతున్నారు.



హుస్నాబాద్‌లో అమ్మవార్లకు ఎత్తుబంగారం ఇస్తున్న యువతి



సిర్గాపూర్‌లో కస్తూర్బా విద్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# అభివృద్ధిలో విద్య, ఆరోగ్యం కీలకం

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సిర్గాపూర్, జనవరి 31: గ్రామాల్లో విద్య, వైద్యం మెరుగుపడితే గ్రామమంతా అభివృద్ధి చెందుతుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం సిర్గాపూర్‌లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు, శంకుస్థాపనలు చేపట్టారు. సిర్గాపూర్‌లో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ.1.54 కోట్లతో సమగ్ర శిక్షా అభియాన్ కింద కస్తూర్బా విద్యాలయం భవన సముదాయాన్ని, సర్వోదయ లైబ్రరీ, స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. స్థానిక హైస్కూలో రూ.27లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి, రూ.13.50లక్షలతో నిర్మించనున్న సైన్స్ భవనానికి కలెక్టర్, ఎమ్మెల్యే భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యకు మించిన శక్తి ఏదీ లేదన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా అందరూ కలిసి పనిచేయాలన్నారు. మండలంలోని అన్ని తండాలకు బీటీ రోడ్లు వేయాలని, సిర్గాపూర్, నారాయణఖేడ్‌లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు అదనంగా ఏర్పాటు చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. అనంతరం సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున స్థానిక సర్పంచ్ జంగం స్వప్నాశంకరయ్యస్వామికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పీరప్ప, ఆర్డీవో వెంకటేశ్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డి, తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో సుజాత, ఎంఈవో శంకర్, ఎస్‌వో లలిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

#### గ్రామాల అభివృద్ధి కొనసాగించాలి

నారాయణఖేడ్, జనవరి 31: పంచాయతీ భవనాల వేదికగా గ్రామాల అభివృద్ధి కొనసాగాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. నారాయణఖేడ్ మండలం పంచగామలో రూ.16 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆర్డీవో వెంకటేశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నారాయణఖేడ్ పట్టణ సమీపంలోని జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈవీఎంలు భద్రపర్చేందుకు స్ట్రాంరూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు కోసం డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు.

# తులం బంగారం పథకం అమలు చేయాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, జనవరి 31: ఇచ్చిన హామీ మేరకు ఆడపిల్లల పెండ్లికి లక్ష రూపాయల సాయంతో పాటు తులం బంగారం ఇచ్చే పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా అమలు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో 38 మందికి కల్యాణలక్ష్మి, 4 షాదీముబారక్ చెక్కులను ఆమె అందజేశారు. అనంతరం మండలంలోని పంతులపల్లిలో రూ. 40 లక్షలతో వేసిన సీసీ రోడ్డు, బస్వాపూర్‌లో రూ. 7లక్షలతో నిర్మించిన ముదిరాజ్ భవనం, రూ. 12.60 లక్షలతో నిర్మించిన శ్మశాన వాటికను ప్రారంభించారు. ఆరెగూడెంలో రూ. 15 లక్షలతో కురుమ సంఘం భవవ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కారు అన్నివర్గాల అభివృద్ధికి కృషిచేసిందన్నారు.



వెల్దుర్తిలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఆడపిల్లల పెండ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదని, ఆడ పిల్లల కుటుంబాలను ఆదుకోవాలనే మంచి లక్ష్యంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కేసీఆర్ అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. లక్ష నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, త్వరగా అమలు చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ స్వరూప, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, సర్పంచ్‌లు భాగ్యమ్మ, శేఖర్, మల్లేశంగౌడ్, ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, ఆత్మక మిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ తుల సీరాం, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, ఆర్ఐ జయభరత్‌రెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ
- ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



చంద్లాపూర్‌లో ఉచిత కుట్టు శిక్షణ ముగింపులో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

చిన్నకోడూరు, జనవరి 31: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మహిళలకు 30 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో ఆయా గ్రామాల్లో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రంగనాయకసాగర్‌లో భూములు కోల్పోయిన గ్రామాల్లో మెదటగా మహిళలకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో మహిళలకు భోజనం వసతి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురగొని చంద్రకళారవి గౌడ్, ఎంపీటీసీ దుర్గారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళిగౌడ్, నాయకులు మధుసూదన్ రెడ్డి, ఏపీఎం మహిపాల్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగం, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.



సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులతో మాట్లాడుతున్న సీపీ అనురాధ

# అంకితభావంతో పనిచేయాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట టౌన్, జనవరి 31: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ పోలీసులను ఆదేశించారు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి కేసుల పురోగతిని సీఐ కృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రతి కేసును పూర్తి పారదర్శకంగా దర్యాప్తు చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అందరూ కృషిచేయాలన్నారు. ప్రజలు సైబర్‌నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. అంతకుముందు మహిళా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఫిర్యాదులపై త్వరగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం పోలీస్ క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో బాధితులతో మాట్లాడుతున్న సీపీ

# పిల్లల్లో పోషణ లోపాన్ని గుర్తించాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

కొమురవెల్లి, జనవరి 31: పిల్లల్లో పోషణ లోపాన్ని గుర్తించి వారికి బాలామృతం ప్లస్ ఇవ్వాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గౌరాయపల్లిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ సద్ది కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతేడాది ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. దానిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో తీవ్ర పోషణ లోపాన్ని గుర్తించాలని సూచించారు. ప్రతినెలా పిల్లల వయస్సును బట్టి బరువు, ఎత్తు చెక్ చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించడంతో పాటు విద్యార్థులను పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు అడుగగా వారు సరైన సమాధానం చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలోని నర్సరీ, డంపింగ్ షెడ్‌ను పరిశీలించారు. డీడబ్ల్యూవో రామ్‌గోపాల్‌రెడ్డి, సీడీపీవో శారద, ఎంపీడీవో అనురాధ, సూపర్‌వైజర్ పావని, ఎంపీటీసీ కొయ్యడ రాజమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా గౌరాయపల్లిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

# చేర్యాలలో గంజాయి చాక్లెట్లు స్వాధీనం

చేర్యాల, జనవరి 31: బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు చేర్యాలలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పట్టణంలో దాడులు నిర్వహించి నిందితుడు రాకేశ్‌కుమార్‌ను పట్టుకున్నారు. బుధవారం ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ విలేకరులతో మాట్లాడుతూ బీహార్ రాష్ట్రానికి చెందిన రాకేశ్‌కుమార్ కొంతకాలంగా చేర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి చేర్యాలలో విక్రయిస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా చాక్లెట్లు రూపంలో ఉన్న గంజాయిని నిందితుడు ఈ ప్రాంతంలో పనులు చేసే బీహార్ కార్మికులకు ఎక్కువగా విక్రయించేవాడు. పోలీసులు దాడులు నిర్వహించి నిందితుడి నుంచి 30 ప్యాకెట్లలో 6 కిలోల బరువు గల 1200 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు టి.వినోద్‌కుమార్, పి.సురేశ్, సిబ్బంది ఫరీద్, రవి, స్వామి, నర్సింహులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్

# బదిలీలకు కసరత్తు!



### జహీరాబాద్ డివిజన్‌లో అధికారుల బదిలీలకు ఫైల్ సిద్ధం..?

- పోలీసు, రెవెన్యూ, రవాణా, పీఆర్ శాఖల అధికారుల బదిలీలకు అధికార పార్టీ నేతల ప్రయత్నాలు
- మంత్రికి బదిలీల జాబితా అందించినట్లు సమాచారం
- అనుకూలురను తెచ్చుకునేందుకు పార్టీ పెద్దలకు విజ్ఞప్తులు
- అధికార పార్టీ నేతల చుట్టూ అధికారుల చక్కర్లు

జహీరాబాద్, జనవరి 31: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ శాఖల్లో అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. కీలకమైన పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ,రవాణాశాఖల్లో బదిలీలపై జోరుగా ఊహాగనాలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకుల చుట్టూ చక్కర్లు కొడుతున్నట్లు తెలిసింది. కావాల్సిన పోలీస్‌స్టేషన్, కావాల్సిన మండలానికి వచ్చేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు సమాచారం. పోలీసు శాఖల్లో తమకు కావాల్సిన వారికి పోస్టింగ్‌లు ఇప్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

#### ఆ శాఖల్లో బదిలీలపై జోరుగా ప్రచారం...?

రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల బదిలీలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని సమాచారం. జహీరాబాద్ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే లేకపోవడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండడంతో అధికారులను మార్చేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోపు పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, రవాణా శాఖల్లో బదిలీలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.జిల్లాకు చెందిన మంత్రికి బదిలీలకు సంబంధించిన నివేదికను ఇచ్చినట్లు సమాచారం. ఎస్సైలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, పీఆర్, ఆర్‌అండ్‌బీ, చిన్న నీటిపారుదల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, వ్యవసాయశాఖ, సర్కారు దవాఖానల్లో వైద్యాధికారుల బదిలీలపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మండల స్థాయి అధికారులు, సిబ్బందిని కొంతమందిని బదిలీ చేయాలని మండల స్థాయి అధికార పార్టీ నాయకులు కోరుతున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు కాంగ్రెస్ నాయకులను మచ్చిక చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

#### ఎస్సైల బదిలీలు ఖాయం..?

జహీరాబాద్ నియోజకవర్గంలో జహీరాబాద్ పట్టణం, జహీరాబాద్ రూరల్, చెరాగ్‌పల్లి, కోహీర్ పోలీస్‌స్టేషన్లు జహీరాబాద్ పట్టణ సర్కిల్ పరిధిలో ఉన్నాయి. జహీరాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలో హద్నూర్, ఝరాసంగం,రాయికోడ్ స్టేషన్ ఉంది. కొన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్సైలను బదిలీ చేసేందుకు అధికార పార్టీ నాయకులు పార్టీ పెద్దలకు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. అధికార పార్టీ నాయకులు నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రణాళికలతో పాటు బదిలీలపై ప్రధానంగా తమకు నచ్చిన ఎస్సైల పేర్లను ప్రతిపాదించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. అధికార పార్టీ నాయకుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని అధికారులను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.జహీరాబాద్ డివిజన్‌లో పనిచేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్, నీటిపారుదలశాఖ, గ్రామీణ నీటిసరఫరా, రవాణాశాఖల్లో పనిచేస్తున్న అధికారుల జాబితాను సేకరించినట్లు తెలిసింది. డివిజన్, మండల స్థాయి అధికారులు జహీరాబాద్ నియోజకవర్గంలో నాలుగేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులను బదిలీ చేసేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. డివిజన్‌లో ఎక్కువకాలం పనిచేసిన అధికారులను బదిలీ చేసేందుకు మంత్రికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల స్థాయి అధికారుల బదిలీలు జరుగలేదు. ఈసారి తప్పకుండా జరిగే అవకాశం ఉందని పలు శాఖల అధికారులు తెలుపుతున్నారు.